క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని రామచంద్రగూడం సబ్‌స్టేషన్ మెయింటనెన్స్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాలో సోమవారం అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో వన్ టౌన్ ఏఈ పి.మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రగూడం, బంగారిగడ్డ, శ్రీనిధికాలనీ, భాగ్యనగర్ కాలనీ, చైతన్యనగర్, తాళ్లగడ్డ, రాంనగర్, ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ కార్యదర్శిగా నాగేశ్వర్‌రావు



మిర్యాలగూడ టౌన్ : జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన గుండెబోయిన నాగేశ్వర్‌రావును నియమిస్తూ ఆ సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నాగేశ్వర్‌రావు తెలిపారు. తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన సమితి నేతలందరికీ, యాదవ సంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాగేశ్వర్‌రావు నియామకంపై బీసీ నేతలు మురళి యాదవ్, జయరాజులు హర్షం వ్యక్తం చేశారు.

డిండి వాసికి జేఈఈలో ఆలిండియా 616 ర్యాంకు



డిండి : డిండి పట్టణానికి చెందిన వంగాల కవిత–ప్రభాకర్‌రెడ్డి కుమారుడు వంగాల ప్రణీత్‌రెడ్డికి శనివారం వెలువడిన జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 616 ర్యాంకు సాధించాడు. ఆలిండియా ర్యాంకు సాధించడంపై డిండి ప్రజలు ప్రణీత్‌రెడ్డిని ఆదివారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని చిల్లాపురం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి లక్ష్మీనారాయణ విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మీనారాయణ కుటుంబానికి తాము అండగా ఉంటామని తెలిపారు.

ఆశ్రమ చర్చిలో ఈస్టర్ వేడుకలు



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

దేవరకొండ : పట్టణంలోని షాలోం ఆశ్రమ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ ఆషేర్ క్లారిటన్ క్రీస్తు బోధనలు వినిపించారు.

కులాంతర వివాహం



వివాహం చేసుకుంటున్న శంకర్, దీప్తి

నల్లగొండ టౌన్: పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఆదివారం శాలిగౌరారం మండలం మాదారం గ్రామానికి చెందిన శంకర్, దీప్తికి కేవీపీఎస్ ఆధ్వర్యంలో కులాంతర వివాహం చేశారు. శంకర్, దీప్తిలతో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, ప్రజా సంఘాల నాయకులు మానుపాటి భిక్షమయ్య, పందుల సైదులు, రమణారెడ్డిలు దండలు మార్పించి వివాహం చేయించారు. కార్యక్రమంలో బొడ్డు శివకుమార్, బొల్లు రవీందర్, షరీఫ్, శీనయ్య, రమేష్, శివ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కలిగిఉండాలి

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగిఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి పశ్య సుబ్బరాం రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వారోత్సవాల సందర్భంగా ఎన్నెస్పీ క్యాంప్ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రవిబాబు ఉన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

- 8 కేంద్రాల్లో 41, 402క్వింటాళ్ల ధాన్యం సేకరణ
- రెండు, మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ



కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు లోడ్ చేస్తున్న హమాలీలు



ఎగుమతికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని అనుముల మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. 83వేల క్వింటాళ్ల ధాన్యం లక్ష్యాన్ని నిర్దేశించుకున్న అధికారులు ఇప్పటి వరకు 41 వేల402 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 90శాతం మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. అనుముల మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 8 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఆయా కేంద్రాల్లో 266 మంది రైతుల నుంచి41 వేల 402 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. అలాగే ఎప్పటి కప్పుడు కొనుగోలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని పులిమామిడి, రామడుగు, శ్రీనాథపురం, చింతగూడెం, పాలెం, వీర్లగడ్డ తండా, కొత్తపల్లి, చల్మారెడ్డిగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

శ్రీనాథపురంలో అత్యధికంగా కొనుగోలు..

ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఆధ్వర్యంలో మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు శ్రీనాథపురం గ్రామంలో అత్యధికంగా 45మంది రైతుల వద్ద నుంచి 10712 బస్తాల ధాన్యం కొనుగోలు చేసి ఎగుమతి చేశారు. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రంలో శ్రీనాథపురం గ్రామం మండలంలోనే మొదటి స్థానంలో నిలిచింది. అదే విధంగా రామడుగులో 54 మంది రైతుల నుంచి 9524 బస్తాల ధాన్యం కొనుగోలు చేయగా ధాన్యం బస్తాల ను అంతా ఎగుమతి చేశారు. కొత్తపల్లిలో 81మంది రైతుల నుంచి 5894 బస్తాల ధాన్యం కొనుగోలు చేశారు. పులిమామిడిలో 23రైతుల నుంచి 4185 బస్తాల ధాన్యం కొనుగోలు ఎగుమతి చేశారు. చల్మారెడ్డిగూడెంలో 21 మంది రైతుల నుంచి 3694బస్తాల ధాన్యం కొనుగోలు చేశారు. చింతగూడెంలో 19మంది రైతుల నుంచి 2776 బస్తాల ధాన్యం కొనుగోలు చేసి ఎగుమతి చేశారు. పాలెం లో 11మంది రైతుల నుంచి 2569 బస్తాల ధాన్యం కొనుగోలు చేశారు. వీర్ల గడ్డతండ లో 12మంది రైతుల నుంచి 2048 బస్తాల ధాన్యం కొనుగోలు చేసిన ధాన్యం అంతా ఎగుమతి చేశారు.

కొనుగోళ్లను వేగవంతం చేశాం



మూడు, నాలుగు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా కృషి చేస్తున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. మండలంలో ఎనిమిది సెంటర్లలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేశాం.

– కళావతి, ఏపీఎం హాలియా

నేడు చందంపేటకు మంత్రి పొంగులేటి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ రమణారెడ్డి

చందంపేట : భూ భారతి చట్టంపై చందంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే అవగాహన సదస్సులో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి పాల్గొననున్నట్లు దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. రైతులకు భూ భారతి చట్టం, పోర్టల్‌పై అవగాహన కల్పించడంతో పాటు సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఈ సమావేశానికి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి కోరారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ గోవర్ధన్‌రెడ్డి, డీటీ అయూబ్, కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు బద్యానాయక్, నోముల మల్లయ్య, వరికుప్పల కొండల్ తదితరులు పాల్గొన్నారు.

విజయాలకు వ్యక్తిత్వ వికాసం తోడ్పాటు

నాగార్జునసాగర్ : వృత్తిపరమైన విజయాలను సాధించేందుకు వ్యక్తిత్వ వికాసం దోహదపడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నాగార్జునసాగర్ పోలీస్ సర్కిల్ పరిధిలోని సాగర్, పెద్దవూర, తిరుమలగిరి(సాగర్) పోలీస్‌స్టేషన్ల సిబ్బందికి సాగర్ సీఐ శ్రీనునాయక్ సహకారంతో ఏకె ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ట్రెన్ యువర్ టంగ్' అనే వ్యక్తి వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు విజయ్ జదుపతి సిబ్బందికి వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. పాజిటీవ్ ఆటిట్యూడ్, కమ్యూనికేషన్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, బాడీలాంగ్వేజ్ తదితర విషయాలపై సెమినార్ నిర్వహించి, వారితో ఆక్టివిటీస్ చేయించారు. అనంతరం సాగర్ సీఐ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి వారి వృత్తిలో ఉత్తమ ప్రతిభ కనబరచడానికి వ్యక్తిత్వ వికాసం ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గంలో యువతకి నిరుపేద వర్గాలకు సామాజిక మార్పునకు ఎన్నో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏకే ఫౌండేషన్ చైర్మన్ అడ్వకేట్ అనిల్‌కుమార్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్, సాగర్ ఎస్‌ఐ సంపత్, తిరుమలగిరి, పెద్దవూర ఎస్‌ఐలు వీరశేఖర్, వీరబాబులు, హెడ్‌కానిస్టేబుళ్లు హోంగార్డ్స్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నిమ్మల నవీన్‌రెడ్డి

మాడుగులపల్లి : మండల పరిధిలోని ఇసుకబావి గూడెం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిమ్మల నవీన్‌రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెర్రిపోతుల రాములుగౌడ్, సామ వెంకన్న, మేడి సుందర్‌గౌడ్, రవి, చంద్రశేఖర్, పోతురాజు శ్రీనివాస్, ప్రభాకర్, యాదయ్య, పోతురాజు, సురేష్, రాజేష్, రాము ప్రభాకర్, పుల్లెంల రవి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలి

మాడుగులపల్లి : వేసవికాలంలో పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పిల్లలు ఇంటికి చేరుకుంటారని, తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాని ఎస్‌ఐ కృష్ణయ్య అన్నారు. ఆదివారం మండలంలోని తోపుచర్ల గ్రామంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి మాట్లాడారు. పిల్లలు ఈతకు కాల్వలు, బావుల, చెరువుల వద్దకు వెళ్తారని, అలా కాకుండా తల్లిదండ్రుల సంరక్షణలో ఈత నేర్చుకోవాలన్నారు. పిల్లలు ఎండలో తిరగనీయకుండా ఇంటి వద్దనే ఉండేలా చూసుకోవాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

రక్తదానం ఎంతో గొప్పది



గాంధీనగర్‌లో రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు

మిర్యాలగూడ టౌన్ : అన్ని దానాల కంటే రక్తదానం ఎంతో గొప్పదని, ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఈ రక్తం ఎంతో ఉపయోగపడుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సజ్జల నాగిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 34, 35 వార్డు గాంధీనగర్‌లో బీజేపీ దళిత మోర్చా జిల్లా కార్యదర్శి ఉబ్బపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయా వార్డులకు చెందిన యువకులు రక్తదాన శిభిరం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు వనం మధన్‌మోహన్, చిలుకూరి శ్యాం, దాసరాజు శివ, గూడూరు శ్రీనివాస్‌రావు, బొట్టు సోములు, చెరుపల్లి కరుణాకర్, డాక్టర్ అంజయ్య, బంటు యాదగిరి, వెంకటేశ్వర్లు, పరంగి శ్యాం, ఉబ్బపల్లి నాగార్జున, శివ, రాజశేఖర్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అల్వాల డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

త్రిపురారం : మండలంలోని నీలాయిగూడెం గ్రామానికి చెందిన పరిక వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబం పేదరికంలో ఉందని గ్రామస్తులతో తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ అల్వాల డిప్యూటీ కమిషనర్ ఉమ్మడి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం నీలాయిగూడెంలో మృతుడు వెంకటయ్య ఇంటికివెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. గ్రామంలో ఇప్పటి నుంచి ఎలాంటి ప్రమాదాలు జరిగినా అలాగే మృతుల కుటుంబాలకు కుందూరు రఘువీర్‌రెడ్డి యువసేనా ఆధ్వర్యంలో ఆర్థిక సాయాలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వంగాల తిరుమల రెడ్డి, వేముల నాగయ్య, కుందనపల్లి సందీప్, కసిరెడ్డి రంగారెడ్డి, బలరాం రెడ్డి, చిట్టపు నాగిరెడ్డి, కుందనపల్లి లింగయ్య, కుర్ర వెంకన్న, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

గుర్రంపోడు : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2007–2008లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు వక్తలు పాఠశాల స్నేహం బలమైనదని, భవిష్యత్తులోనూ ఒకరికి నోకరు అండగా ఉండాలన్నారు. ఆనాటి ఉపాధ్యాయులు లింగారెడ్డి, రాము, కేసాని జయప్రకాశ్‌రెడ్డి, కౌసల్య, కవిత, విజయ, ఝాన్సీలను పూలమాలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, కరుణాకర్, వడ్డగోని సైదులు, అమరేందర్, రవీంద్రాచారి, సురేష్, శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా నాగభూషణం



మిర్యాలగూడ అర్బన్ : తెలంగాణ ఉద్యమకారుల మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నల్లగంతుల నాగభూషణం నిమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీను ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ.. ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్రనాయకులకు, స్థానిక నాయకులు మారం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్, శ్రీనివాసులకు కృతజ్ఞతలు తెలిపారు. నాగభూషణం నియామకంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. ముఖ్యంగా స్థానిక సాగర్ రోడ్డులోని జేబీ కాలనీలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గల రోడ్డుపైన మురుగు నీరు పారుతుండడంతో దుర్గంధం వెదజల్లుతుంది. పక్కనే ఉన్న గ్రామపంచాయతీ సిబ్బంది పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. ఈ మురుగు నీరు ప్రవాహం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రామపంచాయతీ సమీపంలో ఈ మురుగు ప్రవహిస్తున్న వాళ్లు పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఈ మురుగు నీరు వెళ్లే విధంగా శాశ్వత పరిష్కారం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఫ్రీజర్ బాక్స్ అందజేత



ఫ్రీజర్ బాక్స్‌ను అందజేస్తున్న శ్రీపతిరావు

డిండి: మండల కేంద్రంలోని లిటిల్ మాస్టర్ హైస్కూల్ యజమాని పులిగిల్ల శ్రీపతిరావు ×డిండి యవత చేయూత¤ ఫౌండేషన్‌కు రూ.60వేల విలువగల బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు శ్రీపతిరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్రీజర్ బాక్స్‌కు ఎలాంటి రుసుము చెల్లించకుండా డిండి పట్టణ ప్రజలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటి.కృష్ణ, శైలేష్, శ్రీనివాస్‌గౌడ్, మధు, రమేష్,శ్రీను, నరేష్, ఖయ్యూం, వేణు, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనంలోకి పోయేదెలా!



ఉద్యానవనం గేటు ఎదుట పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలోని స్థానిక సాగర్ రోడ్డులోని జేబీ కాలనీలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయ రూర్బన్ మిషన్ 3వ ఫేజ్ నిధుల కింద రూ.40లక్షల వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో ఉద్యాన వనాన్ని నిర్మించారు. ఈ ఉద్యాన వనంలో మొక్కలు పెంచుతూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. ఉద్యానవనం గేటు ప్రవేశ ద్వారం భాగం మొత్తం కంపచెట్లతో నిండుకుపోయింది. ఈ కంపచెట్లు గేటుకు అడ్డంగా ఉండడంతో లోపలికి వెళ్లే పరిస్థితి లేదు. పలుమార్లు గ్రామపంచాయతీ సిబ్బందికి తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు అంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఉద్యానవనం ముందు భాగాన్ని శుభ్రం చేయాలని కోరుతున్నారు.

మాల్‌లో ఈదురు గాలుల బీభత్సం



మాల్ వెంకటేశ్వర్ నగర్‌లో రోడ్డుపై పడ్డ వేప చెట్టు



రోడ్డుపై కూలిన స్తంభం

చింతపల్లి : మండల పరిధిలోని మాల్ పట్టణంలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఓ ఇంటిపై కప్పు రేకులు గాలికి ఎగిరిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, పలు కాలనీలో చెట్ల వేర్లతో సహ కూలిపోయాయి. పలు వాణిజ్య, వ్యాపార సంస్థల నేమ్ బోర్డులు ఊడిపడ్డాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిర్యాలగూడ టౌన్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కురియాతండా సమీపం నుంచి అక్రమం ఇసుక తరలిస్తుండగా కురియాతండా శివారులోని ఎస్ఎస్‌పీ కాల్వ వద్దకు వెళ్లగా ఇసుక ట్రాక్టర్‌లో నింపుకొని వస్తుండగా పోలీసులను చూసి పారిపోయాడు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు



ధ్వంసమైన సీసీ రోడ్డు



సీపీఐ కార్యాలయం సమీపంలో..

- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు

దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని పలు కాలనీల ప్రధాన రహదారులతో పాటు అంతర్గత సీసీ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు అధ్వానంగా మారడంతో పాదచారులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఓ వైపు కాలనీల్లో రోడ్లపై వాహనాలు నడిపితే వాహనాలు మరమ్మతులకు గురికావడమే కాకుండా తమకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు.

ఏళ్ల తరబడి..

మున్సిపాలిటీ పరిధిలోని ఆయా కాలనీల్లో ప్రజలకు గతంలో ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించేందుకు గాను 2018లో అధికారులు దాదాపు 120కిలో మీటర్ల మేర ఇంటింటికీ పైప్‌లైన్ కోసం సీసీ రోడ్లు తవ్వి పనులు చేపట్టారు. కాగా వీటిలో దాదాపు 80కిలో మీటర్ల మేర సీసీ రోడ్లు ధ్వసం అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.ఇదిలా ఉంటే త రెండేళ్ల కిందట పట్టణంలోని పలు కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం కోసం మరో మారు సీసీ రోడ్లను తవ్వి పనులు పూర్తి చేశారు. ఏళ్ల తరబడి అస్తవ్యస్తంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పట్టణ ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని పలలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభం



సీసీ రోడ్లకు సంబంధించి నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం. ఇటీవల రూ.30కోట్లు నిధులు మంజూరయ్యాయి. ప్రధానంగా ఎక్కడ సమస్య జఠిలంగా ఉందనేది గుర్తించి అక్కడ ముందుగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నాం. కొంతమేర అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు సైతం చేపడుతాం. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశాం. మరో వారంలో సీసీల నిర్మాణ పనులు జరుగనున్నాయి.

– రాజు, మున్సిపల్ ఏఈ, దేవరకొండ

రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం

- ఏడాదిగా కొనసాగుతున్న చిత్రియాల–పెద్దమూల రహదారి
- పలు చోట్ల కంకరపోయడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



కంకర తేలి ప్రమాదకరంగా ఉన్న చిత్రియాల- పెద్దమూల రోడ్డు

చందంపేట : మండలంలోని చిత్రియాల గ్రామం నుంచి పెద్దమూల గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గం నిర్మాణ పనులు చేపట్టి ఏడాదైంది. రూ.5.38కోట్ల వ్యయంతో ఆరు కిలో మీటర్ల మేర చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని గ్రామస్తులు, వాహనదారులు ఆరోపిస్తున్న కంకర వేసి అలాగే వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. వాహనాలు త్వరగా రిపేర్లకు వెళ్తున్నాయని, అత్యవసర సమయాల్లో, ప్రాణాపాయ పరిస్థితుల్లో ఈ రోడ్డు ప్రయాణమంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన నాణ్యతో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలు సాగించలేక పోతున్నాం



చిత్రియాల ఊరు నుంచి పెద్దమూల ఊరు దాక చేపట్టిన రోడ్డు పనులు ఏడాది దాటింది. కంకరపోసి వదిలేయడంతో రాకపోకలు సాగించలేకపోతున్నాం.ఈ ఆరు కిలోమీటర్లు ప్రయాణమంటేనే నరకంగా మారింది. దేవరకొండకు పోయిరావాలంటే ఈ ఆరు కిలోమీటర్లు దాటడం పెద్ద కష్టంగా మారింది. అధికారులు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– ఉప్పనూతల వెంకటయ్య